క్లుప్తంగా

కష్టపడి చదివితేనే భవిష్యత్తు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ యూసూఫ్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అధ్యాపకులు సంతోష్, శ్రీనివాస్, సతీష్, సరస్వతి, హారిక, విద్యార్థులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు వివరించాలి



రాజంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యకర్తలు పనిచేయాలని మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి అన్నారు.మండలంలోని బస్వన్న పల్లి గ్రామంలో యాదవ సంగంలో కాంగ్రెస్ మండల కమిటీ సభ్యులతో, గ్రామ అధ్యక్షులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మాశెట్టి శ్రీధర్, సెక్రటరీ సంజీవ రెడ్డి, బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బీరయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ్ తదితరులున్నారు.

నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలి



రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలోని శారద శిశుమందిర్ పాఠశాలలోని విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు వేశారు. వైద్యులు హరీష్ గౌడ్, డాక్టర్ దివ్యభారతి, పాఠశాల హెచ్ఎం పండరీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ



పిట్లం(జుక్కల్): మండలంలోని రాంపూర్ గ్రామం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీలత, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ వసంతమ్మ పాఠశాలలోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. సిబ్బంది విఠల్, నబీ, స్వరూప, శివ, నాగేశ్వర్‌రావు, పుష్పలత, సీఆర్పీ గోపాల్ పాల్గొన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి ఆదేశాలు



సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని గాలీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా, అర్థంతరంగా నిలిచిన అదనపు గదుల నిర్మాణ పనులకు మోక్షం లభించింది. 'ఆగమవుతున్న చదువులు' అంటూ బుధవారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి కలెక్టర్ అశిష్ సంగ్వాన్ స్పందించారు. అర్ధంతరంగా నిలిచిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ అశిష్ సంగ్వాన్ విద్యాశాఖ, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ నాగేశ్వర్‌రావు అదనపు గదులను పరిశీలించారు. అదనపు గదుల నిర్మాణ పనుల పూర్తి జుక్కల్ ఎమ్మెల్యే రూ. 5 లక్షలు మంజూరు చేశారని రెండు, మూడు రోజుల్లో పనులు పునఃప్రారంభించాలని ఆదేశించారు. అసంపూర్తిగా నిలిచిన అదనపు గదుల నిర్మాణ పనులపై వరుస కథనాలు ప్రచురించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

సేవలు అభినందనీయం



భిక్కనూరు : జంగంపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో ప్రత్యేకాధికారిగా పనిచేసిన మనిదీప్తి అందించిన సేవలు అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. పదోన్నతిపై బదిలీ అయిన మనిదీప్తిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వంతెన నిర్మాణాల్లో నిండా నిర్లక్ష్యం

- ఏళ్లుగా సాగుతున్న పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- స్పందించని అధికారులు



అన్నారం తండా వద్ద కొనసాగుతున్న వంతెన పనులు



కొండాపూర్ వంతెన వద్ద అధ్వానంగా రోడ్డు

రాజంపేట : మండలంలోని గుడితండా, కొండాపూర్లో ఈనాం తండా, అన్నారం తండా గ్రామాల పరిధిలో నూతన వంతెనలు నిర్మించకపోవడంతో ప్రజలు వానాకాలంలో జల దిగ్బంధంలో చిక్కుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. గుడి తండా, ఇనాం తండా శివారుల్లో వాగులు ఉప్పొంగి ప్రవహిస్తే కనీసం పది రోజుల పాటు ఇళ్లలోనే బిక్కుబిక్కుమంటూ ప్రజలు గడుపుతారు. కొన్ని సార్లు ఆయా గ్రామస్తులు తాళ్ల సాయంతో ప్రమాదకరంగా వాగులను దాటి నిత్యావసర సరకులు తెచ్చుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నిధులు మంజూరైనా..

గుడి తండా, ఇనాం తండా శివారులో వాగులపై వారధులు నిర్మించడానికి వ్యయం ఎక్కువవుతుందని కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. దీంతో సమస్య అలాగే ఉంటుంది. అన్నారం తండా వద్ద వారధి నిర్మా ణంలో ఉండటంతో ప్రస్తుతం గ్రామస్తులు పొలాల నుంచి వేసిన తాత్కాలిక రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నారు. నాలుగు నెలల నుంచి వంతెన నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

వానాకాలం వచ్చినా ఇంకా పూర్తి కాకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి మధ్య రెండు వంతెనలను నిర్మించినా అప్రోచ్ రహదారులను మట్టితోనే వేశారు. తారు రోడ్డు వేయకపోవడంతో చిన్నపాటి వానలకే అది బురదమయంగా మారి వాహనదారులకు ఇక్కట్లు తప్పడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి త్వరగా పనులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మాది అన్నారం తండా, వానాకాలం వస్తే వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వర్షాలు పడితే పంట పొలాలకు, ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు చేపట్టడం లేదు. అధికారులు స్పందించి నిర్మాణం పూర్తి చేయించాలి.

– బీ రవీందర్, అన్నారం

పల్లెల్లో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు

- ఉచ్చులో చిక్కుకుంటున్న టీనేజర్లు
- దుర్వ్యసనాలకు బానిసవుతున్న యువకులు



మాచారెడ్డి : ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన గంజాయి ప్రస్తుతం పల్లెలకు విస్తరించింది. దీంతో టీనేజర్లే ఎక్కువ శాతం ఆకర్షితులై భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసుకుంటున్నారు. మాచారెడ్డి కేంద్రంగా గంజాయి గతంలో గజ్యానాయక్ తండా చౌరస్తాకు చెందిన ఓ యువకుడు డ్రగ్స్‌కు బానిసై ఆస్పత్రి పాలయ్యాడు. కొద్ది రోజులు చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. గంజాయితో పాటు బెట్టింగులు వంటి దుర్వ్యసనాలకు లోనవుతున్నారు. గత కొన్ని రోజులుగా మాచారెడ్డి కేంద్రంగా గంజాయి దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. చాలా టీనేజర్లు గంజాయితో పాటు కల్తీ కల్లుకు బానిసై రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల ముగ్గురు యువకులు మద్యం సేవించి బైక్‌పై నుంచి పడి ఆస్పత్రి పాలయ్యారు. డ్రగ్స్ నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతామని పదే పదే ప్రకటనలు గుప్పిస్తున్నా లాభం లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. బతుకు దెరువు కోసం గల్ఫ్ దేశాలకు వెళ్ళిన యువకులు ఇక్కడ డ్రగ్స్, కల్తీ కల్లుకు బానిసలై తిరిగి స్వ గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇటీవల మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇక్కడ ఉపాధి అవకాశాలు లేక సౌదీ అరేబియా వెళ్ళాడు. అక్కడ కల్లు దొరక్క తీవ్ర అస్వస్థతకు గురై స్వ గ్రామం చేరుకున్నాడు. 15రోజుల కిందట ఎల్లం పేట గ్రామానికి ఓ యువకుడు గంజాయితో స్థానిక పోలీసులకు పట్టు బడగా కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

మాదక ద్రవ్యాలపై నిఘా



మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాలు,తండాల్లో తనిఖీలు ముమ్మరం చేశాం. మాదక ద్రవ్యాలు కలిగి ఉన్నా, వాటిని సేవించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్ గౌడ్, ఎస్సై

జోరుగా పోలీసుల తనిఖీలు



భిక్కనూరు టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీ



బీబీపేటలో..



పెద్దకొడప్‌గల్‌లో..



పిట్లంలో..



బాన్సువాడలో..

భిక్కనూరు : 44వ నంబరు జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద రవాణా శాఖ ఆధ్వర్యంలో జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు బ్లాక్ ఫిలిం ఉండడం, సీటు బెల్టు ధరించకపోవడంపై 30 మందికి జరిమానాలు విధించారు.

బీబీపేట : మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో గురువారం సాయంత్రం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎస్సై ప్రభాకర్ ఆధ్వర్యంలో నంబర్ ప్లేట్ లేని బైక్‌లకు సీజ్ చేశారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలతో పాటు, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు 11 బైక్‌లకు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఆయన వివరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పెద్దకొడప్‌గల్(జుక్కల్) : వాహనాలకు సంబంధించిన అన్నిపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని ఏఎస్సై రాములు తెలిపారు. గురువారం మండలంలోని బేగంపూర్ చౌరస్తా 161 జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద(జుక్కల్) : మండల కేంద్రంలోని గోపన్ పల్లి, అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం సీఐ జగడం నరేష్, ఎస్సై మోహన్‌రెడ్డి వాహనాలు తనిఖీ చేశారు. టూ వీలర్ ఆటోలు, జీపీలు డ్రైవర్ల లైసెన్సులు, ఫిట్‌నెస్, పర్మిట్‌లు లేని వాహనాలకు జరిమానా విధించారు. ట్రాక్టర్లు కేజీవీల్‌తో బీటీ రోడ్లపై రావద్దని, కేసులునమోదు చేస్తామని అన్నారు.

పిట్లం(జుక్కల్): వాహనదారులు తప్పకుండా ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్సై లింబాద్రి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని పిట్లం - బాన్సువాడ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించి ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు,ధ్రువపత్రాలు లేని వాహదారులకు జరిమానా వేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు

బాన్సువాడ : వాహనాలను మైనర్లకు ఇచ్చి తల్లిదండ్రులు ఇబ్బందుల పడవద్దని పోలీసులు సూచిస్తున్నారు. పోనిలే అని వదిలేస్తే ఇబ్బందులు తప్పవు. మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చే సమయంలో తల్లిదండ్రులు ఒకటికి రెండు సార్లు ఆలోచించాలని అంటున్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కఠినమైన కేసులు నమోదు చేస్తామని పోలీసులు పేర్కొంటున్నారు. వాహనాలు నడిపే పిల్లలపై కోర్టుల్లో నేరాభియోగపత్రం దాఖలు చేస్తారు. దీంతో కనీస రెండు నుంచి ఏడు రోజుల వరకు పరిశీలన గృహానికి (జువైనల్‌హోం) తరలిస్తారు. వారికి వాహనాలిచ్చిన తల్లిదండ్రుల పైనా కేసులు నమోదు చేస్తున్నారు. వారికి శిక్ష తప్పదు. ఈ సందర్భంగా సీఐ మున్నూరు కృష్ణ మాట్లాడుతూ పిల్లలకు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొదన్నారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు.

ఆధ్యాత్మికం

సాయి ఆలయంలో భక్తుల సందడి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని నెమ్లి గ్రామంలో శ్రీ షిర్డీసాయి ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. దీనితో ఆలయ కమిటీ సభ్యులు ఉదయం కాగడ హారతి, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు సాయి నాథునికి మొక్కులు చెల్లించుకున్నారు.

గొల్లకుర్మల వంటావార్పు



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గొల్లకుర్మలు గురువారం లింగంపేట మండల కేంద్రం సమీపంలోని మత్తడిపోచమ్మ వద్దకు వంటావార్పు కోసం గంపలు ఎత్తుకొని తరలివెళ్లారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొల్లకుర్మలు కుటుంబ సమేతంగా డోలు వాయించుకుంటూ ఊరేగింపుగా వెళ్లారు. మత్తడిపోచమ్మ వద్ద వంటావార్పు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు తీర్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సంవృద్ధిగా కురవాలని, పిల్లాపాపలను చల్లగ చూడాలని, పాడిపంటలు సంవృద్ధిగా పండాలని అమ్మవారిని కొలిచారు. ప్రతీ ఏటా మృగశిరకార్తి తర్వాత, తొలిఏకాదశికి ముందు గొల్లకుర్మలు వంటావార్పు చేయడం ఆనవాయితీ. కార్యక్రమంలో కులపెద్దలు బైరయ్య, సంగయ్య, రాజయ్య, బాలమల్లు, సాయిలు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.

వైద్య శిబిరాల నిర్వహణ భేష్



ఎల్లారెడ్డి : ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి బీద వారికి సేవలను చేయడం సంతోషకరమని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎల్లారెడ్డి పట్టణ శివారులోని ఎదవర్షిప్ చర్చిలో యూనికార్పస్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ సామెల్, చర్చి వ్యవస్థాపకులు శ్రీనివాసాచారి, లీనా హెప్సీబా తదితరులున్నారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు



తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మాదకద్రవ్యాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఐఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ జిల్లా సమన్వయకర్త అమృత్ రాజేందర్ రావు సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో జరిగిన మండల సమాఖ్య సమావేశానికి హాజరై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో విద్యార్థులు, యువత, ఎలా ఇబ్బందులు పడుతున్నారో వివరించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అవసరమైన చర్యలను వివిధ ప్రభుత్వ శాఖలు చేపడుతున్నప్పటికి మనమందరం కూడా అందులో భాగస్వామ్యం కావల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శోభ, విఠల్ రావు, సీసీలు అంజనేయులు, రాములు, లింగం, నరేందర్ రెడ్డి, సౌజన్య, కృష్ణాంజలి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీసుల తనిఖీలు

దోమకొండ : బీటీఎస్ నుంచి దోమకొండ వచ్చే రోడ్డులో గురువారం ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాలు, అక్రమ మద్యం, గంజాయిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఎస్సై సుదర్శన్, పీసీలు జీవన్, వహీద్, బాలరాజు, మొహినుద్దీన్, స్వాతి తదితరులున్నారు.

రాజంపేటలో వైద్యశిబిరం



రాజంపేట : రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఆధ్వర్యంలో రాజంపేట మండల రెడ్‌క్రాస్ వారి సహకారంతో రాజంపేట మండలం బసనపల్లి గ్రామంలో మెగా ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60ఏళ్లు పైబడిన వారికి మొబైల్ మెడికల్ యూనిట్ మెగా ఆరోగ్య శిబిరంలో పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ రాజన్న స్టేట్ ఎంసీ మెంబర్ సంజీవరెడ్డి, సెక్రెటరీ బి రఘుకుమార్, కరస్పాండెంట్ పీవీ నరసింహం తదితరులున్నారు.

వాయిదాపడ్డ తైబజార్ వేలం



పిట్లం(జుక్కల్): పిట్లం జీపీ కార్యాలయంలో ప్రత్యేక అధికారి, ఎంపీడీవో కమలాకర్ ఆధ్వర్యంలో గురువారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. వేలం పాటలో ప్రభుత్వ అంచనా ప్రకారం డబ్బులు రాకపోవడంతో తైబజార్‌ను వాయిదా వేస్తున్నట్లు, తిరిగి వేలంపాటను ఈ నేల 29న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని జీపీ కార్యదర్శి యాదగిరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బ్రహ్మం, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



రామారెడ్డి : రామారెడ్డి మండలంలోని గొల్లపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు డీఆర్‌డీవో చందర్ గురువారం పరిశీలించారు. కొలత ప్రకారం పనులను చేయాలని సూచించారు. అనంతరం ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య సమావేశానికి హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలలకు అందించే దుస్తులను కొరకు వచ్చిన క్లాత్‌ను పరిశీలించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సవిత, ఏపీవో ధర్మారెడ్డి, ఏపీఎం ప్రసన్న కుమార్, పంచాయతీ కార్యదర్శులు క్రాంతి, జనార్ధన్ పాల్గొన్నారు.

వర్షాల కోసం పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలో గురువారం గ్రామస్తులు వర్షాల కోసం పూజలు చేశారు. గ్రామంలో తిరుగుతూ కప్పకావుడి ఆటలు ఆడారు. అలాగే బిందెలో కప్పను ఉంచి బిందె చుట్టూ తిరుగుతూ వానపాటలు పాడుతూ వివిధ రకాల ఆటలు ఆడారు. గ్రామ శివారులో వానవస్తే వరదలు పారే స్థలంలో వరదపాశం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. వారం రోజుల నుంచి వర్షాలు లేక మొలకెత్తిన పత్తి, సోయ, మొక్కజొన్న మొలకలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నిజాంసాగర్(జుక్కల్) : జుక్కల్ మండలంలోని పెద్దగుల్లా గ్రామంలో గురువారం బోధన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్యశిబిరానికి స్థానికుల నుంచి స్పందన లభించింది. వృద్ధులు, మహిళలు కంటి వైద్య శిబిరానికి తరలి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో జుక్కల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అస్పత్‌వార్ వినోద్, గ్రామ నాయకుడు విఠల్‌రావ్ తదితరులు ఉన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

సంక్షిప్తం

నేడు మెగా వైద్య శిబిరం

లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని డాక్టర్ భీమ్‌రాజు ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి (మొబైల్ మెడికల్ యునిట్) మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. లింగంపేట ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కామారెడి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 60 ఏళ్లకు పైబడిన వృద్ధులు, వికలాంగులకు పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఈసీజి, కంటి పరీక్షలు, దంత పరీక్షలు, రక్త పరీక్షలు, నిర్వహించి మందులు ఉచితంగా సరఫరా చేస్తామన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



భిక్కనూరు : భిక్కనరు మండలం తిప్పాపూర్ గ్రామానికి చెందిన బైని కొండల్‌రెడ్డి ఇటీవల కరెంటు షాక్‌తో మృతిచెందగా, ఆయనకు పోస్టాఫీస్‌లో ఉన్న ప్రమాద బీమా ఆధారంగా రూ.10 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. గురువారం పోస్టల్ ఉన్నతాధికారులు జనార్దన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో చెక్కును అందించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు



రాజంపేట : రాజంపేట సొసైటీ డైరెక్టర్ శ్రీరాం సురేష్, పొందుర్తి ఎంపీటీసీ బాల్‌రాజ్ గౌడ్ గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు, మండల అధ్యక్షులు యాదవరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణారావు, అసెంబ్లీ యూత్ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి, పొందుర్తి గ్రామ అధ్యక్షులు బాబు తదితరులున్నారు.

నల్లాల సర్వే వందశాతం పూర్తవ్వాలి

బిచ్కుంద(జుక్కల్) : నల్లాల సర్వేలను పంచాయతీ సిబ్బంది వంద శాతం పూర్తి చేయాలని ఎంపీవో మహబూబ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాచ్చప్ప అన్నారు. గురువారం కార్యదర్శులతో సమావేశంలో మాట్లాడారు. మండలంలో 82 శాతం అయ్యిందని 100 శాతం పూర్తి చేయాలని కోరారు. తాగునీటిపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. సింగిల్ ఫేస్ మోటార్ల వద్ద నీరు వృథాగా పోకుండా అక్కడే ప్లాస్టిక్ ట్యాంక్ నిర్మించి వాటికి నల్లాల బిగించాలని సూచించారు. ప్రతి రోజు క్లోరినేషన్ నీటిని ప్రజలకు అందించాలన్నారు.

ఎమ్మెల్యే పోచారంను కలిసిన నాయకులు



బాన్సువాడ : హైదారాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గురువారం బాన్సువాడ నియోజకవర్గంకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిశారు. ఈ నెల 22న సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో నిలిచిన అభివృద్ధి పనుల కోసమే ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రూల్లాబాద్, వర్నీ, కొటగిరి, రుద్రూర్, పొతంగల్, చందూర్ మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పోచారంను కలిసిన వారిలో ఉన్నారు. తామంతా పోచారం వెంటనే ఉంటామని స్పష్టం చేశారు.

పశు సంవర్ధక శాఖ ఉద్యోగులకు సభ్యత్వం



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల కేంద్ర సంఘం పిలుపు మేరకు గురువారం పశు సంవర్ధక శాఖ జిల్లా ఉద్యోగులకు టీఎన్జీవో 2024–25 ప్రాథమిక సభ్యత్వాన్ని సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బి.సాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కే శివకుమార్, పోచయ్య, జుగల్‌కిషోర్, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమీకృత భవన పనులు వేగవంతం చేయాలి



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత భవనం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ పాల్త్య విఠల్ అన్నారు. గురువారం భవనం పరిశీలన చేసి పెండింగ్ పనులు త్వరితగతిన చేయాలని అన్నారు.